[మోడరన్ కథలు]

# నరకం

— మల్లంపల్లి హరి



"నమస్తే లాయర్‌గారూ!"

చదువుతోన్న పేపర్‌లోంచి తలపైకెత్తి చూశాడు లాయర్ మూర్తి.

"నా పేరు రామదాస్ సార్."

"అలాగా కూర్చో"

"మిమ్మల్నే నమ్ముకొని వచ్చాను"

"ఇంతకీ విషయమేమిటి?"

"విడాకులు కావాలండి"

"ఎవరికి"

"నాకూ, నా భార్యకు"

"ఎందుకు"

"అది వేరొకరితో కులకడం ఇష్టం లేక"

"అక్రమ సంబంధమన్నమాట"

"అవునుసార్! నేను వూర్లో లేనప్పుడల్లా పక్కింటి కుర్రాడితో కులుకుతుందడి" బాధగా చెప్పాడు రామదాస్.

"అలాగా వాళ్ళిద్దరికి ఆ సంబంధం ఉన్నట్టు సాక్ష్యం వుందా?"

"నేను చెబుతున్నా కదండీ"

"సారి మ్యాన్. నీ సాక్ష్యం చెల్లదక్కడ"

"అయితే మరేం చేయాలండి?"

"ఇంటికెళ్ళి తీరిగ్గా ఆలోచించుకో" అన్నాడు నసుగ్గా.

"అలాగే సార్" అంటూ బయటికి వెళ్ళిపోయాడు రామదాస్.

ఆ తరువాత లాయర్ గారి భార్య భారతి కాఫీ తీసుకొచ్చి అతనికిస్తూ అడిగింది.

"ఏమండి. సాక్ష్యం లేకపోతే కేసుగెలవదా?"

"పిచ్చిదానా! కేసే కాదు ఏ లాయర్ కూడా సాక్ష్యం లేని కేసులు తీసుకోడు. అలా తీసుకొంటే చిత్తుగా ఓడిపోవడం ఖాయం."

"థాంక్సండీ"

"దేనికి" అయోమయంగా అడిగాడు మూర్తి.

"ముందు ముందు మీకే తెలుస్తుంది" ముసి ముసిగా నవ్వుతూ లోపలకు వెళ్ళిపోయిందామె.

"లాయర్ మూర్తికి యాభై సం.ల వయసు. అయిన 'మొదటి భార్య' చనిపోయిన తర్వాత 'భారతిని' రెండో పెళ్ళి చేసుకొన్నాడు. వయసులో తేడా ఉన్నా ఇన్ని రోజులు పతియే ప్రత్యక్ష దైవంగా భావించేది. కాని ఆయనకు రోజురోజుకి ఆమెపై 'అనుమానం' పెరిగిపోతోంది. సూటిపోటి మాటలతో రాచిరంపాన పెట్టసాగాడు. అందుకే ఆమెకు ఆ ముసలి భర్తపై అసహ్యం కల్గసాగింది.

"భారతి నేను వెళ్తున్నాను. నువ్ గుమ్మం దాటి బయటికి రాకు. అసలే రోజులు బాగోలేవు" అన్నాడు మూర్తి.

"అలాగే" నవ్వుతూ అంది.

★ ★ ★

అదిరిపోయాడు లాయర్ మూర్తి.

లోపల నుంచి ఇకఇకలు, పకపకలు.

దబ, దబ తలుపును బాదాడు.

తలుపు తెరిచింది అతని భార్య.

"లోపల ఎవరున్నారో మర్యాదగా చెప్పు లేకపోతే చంపేస్తా" అన్నాడు కోపంగా.

"మీకాశ్రమ అవసరం లేదు. నేను ఇక్కడే వున్నాను" అంటూ బెడ్ రూం లోంచి ఒక యువకుడు బయటికి వచ్చాడు.

"ఎవరు నువ్వు?" కోపంగా అడిగాడు.

"అతని పేరు విజయ్. ఈ రోజు నుండి నా ఫ్రెండ్" చెప్పింది భారతి.

"ఎంత ధైర్యమే నీకు ఇంత బరితెగించి పోతావా? అసలు నువ్వు నాకు అవసరం లేదు రేపే నీకు విడాకులు ఇచ్చేస్తాను" గర్జించాడు మూర్తి.

ఆమె పకపకా నవ్వుతు అంది.

"నిన్ను చూస్తే జాలేస్తుంది."

"ఎందుకు"

"మా ఇద్దరికి అక్రమసంబంధం వున్నట్టు ఎలా రుజువు చేస్తావ్?"

"అదును ఎలా చేయాలి?" అమాయకంగా అడిగాడు మూర్తి.

"తీరిగ్గా కూర్చొని ఆలోచించండి. ఇన్నాళ్ళు ఏ పాపం ఎరుగని నాకు నీ 'అనుమానమే' నరకం చూపించావ్. ఇక నుంచి నల్గురికి చెప్పుకోలేక, సాక్ష్యం చూపించలేక నీలో నువ్వే కుమిలిపోయేలా 'నరకం' చూపిస్తా అంటూ కోపంగా బెడ్‌రూం తలుపులు మూసేసింది భారతి. ●